
# అక్కపందిరి



శ్రీ బులుసు వెంకటరమణయ్య

అదృష్టమంటే జగన్నాథరాజుగారిదే అదృష్టం! ఏమంటే - ఆయన మొదట ఒక చిన్న గుమాస్తాగా విజయనగరసంస్థానంలో అడుగు పెట్టేడు. చదువు చూస్తే నాలుగో క్లాసుకంటే ఎక్కువ లేదు. అయితేనేం? అద్భుతమైన తెలివితేటలుగలవాడు. పనిలో చాలా నిక్కచ్చిగా ఉండేవాడు. ఎవరిదగ్గర ఏవిధంగా ప్రవర్తించాలో అతనికి బాగా తెలుసును. ఆ కారణంచేత జగన్నాథరాజుగారు ప్రభువైన విజయరామగజపతి మహారాజులుంగారి మన్ననలకు పాత్రమై, అభివృద్ధికి వస్తూ అచిరకాలంలోనే జమీందారీకి అసిస్టెండు దివానై, తర్వాత మహారాజులుంగారి బలవంతంమీద హెడ్డు దివానుగిరీ చెలాయించటానికి పూనుకున్నాడు.

దివానుగారిది సుగ్రీవాజ్ఞ. దాన్ని ఎవ్వరూ కూడా అతిక్రమించలేరు. ఎప్పుడూ, ఎవ్వరూ, అతిక్రమించకపోవడంచేత, అలా నిర్లక్ష్యం చేసినవారికి ఎలాంటి శిక్ష విధింపబడేదో తెలుసుకోవడం అసాధ్యమే!

మహారాజులుంగారే - తమ కనిష్ఠమైన విషయాల్లో దివానుగారి ప్రవృత్తికి అడ్డు చెప్పలేకపోయేవారు!

ఒకప్పుడు కొందరు గుమాస్తాలు వ్రాసిన దరఖాస్తు మహారాజులుంగారి సమ్ముఖానికి వెళ్ళింది. దాన్ని చూస్తే అంత శుద్ధమొద్దు స్వరూపాలు మరోచోట వుండరనే స్పష్టమవుతూ వుంది. దాన్ని చూసి, మహారాజులుంగారికి నవ్వు వచ్చింది. 'ఇలాంటివాళ్లు తమ సంస్థానంలో ఉద్యోగులుగా వున్నందుకు - వాళ్లమీద తీరని కోపం వచ్చింది. ఇదంతా ప్రక్కను నిలిచి వున్న దివాను గ్రహిస్తూనే వున్నాడు. మహారాజులుంగారు ఆ కాగితాన్ని దివాను చేతికి అందిస్తూ "జగన్నాథం! మన హుజూరులో యిలాంటి ఉద్యోగస్థులేనా వుండేది?" అని అన్నారు. అలాంటి చవటలు వుండడానికి కారణం దివానే అని తన అభిప్రాయం వెల్లడిస్తూ. దానికి దివాను "చిత్తం, చిత్తం. మహాప్రభువులు అనుగ్రహించాలి. ఈ గుమాస్తాలు చాలా కాలం నుంచీ ప్రభువువారి ఉప్పుతింటూ బతుకుతున్నారు. అమాయకులు!" అన్నాడు.

మహారాజులుంగారు మళ్లీ ప్రశ్నపూర్వకంగా దివానువైపు చూచారు, ఇలాంటి వాళ్లవల్ల సంస్థానం ఎలా నష్టపడుతున్నదో అని అభిప్రాయాన్ని సూచిస్తూ. దివాను అది గ్రహించి 'దివాణంపనుల్లో వీళ్లు చాలా శ్రద్ధగానే వుంటారు. ప్రభువులు చిత్తగించాలి. వీళ్ల రాత, కోతలు ఎలా వున్నా దస్తుశిసుల్లో లోటు ఏమాత్రమూ లేదు. ఒక్క విషయంలో కూడా బకాయి అన్నమాట లేదు.' అని మనవి చేశాడు. మహారాజులుంగారు మరి మాటలాడలేక పోయినారు.

దివానుగారంటే తాశీదార్లందరికీ గొప్ప గౌరవం! ఈయన బెదరించేవాడే కాని, ఒకరి పొట్టమీద కొట్టడని అందరి ధైర్యమున్నూ. ప్రజలందరికీ దివానుగారంటే దేవుడిలాంటివాడన్నమాట!

అంతే కాదు, ప్రభుత్వంవారికీ జగన్నాథరాజు చాలా నమ్మకస్థుడు. ఉత్తరసర్కారులలో వున్న జమీందారీలన్నింటిలోకీ విజయనగరం జమీందారీయే చాలా పెద్దది; ధనవంతమయినది. అలాంటి జమీందారీ ఎటువంటి అల్లకల్లోలాలూ లేక సవ్యంగా జరుగుతున్నదంటే, దానికి దొరతనం కూడా గర్వించవలసినదే! దానికి కారణం దివాను జగన్నాథరాజుగారే అని పై దొరలకందరికీ బాగా తెలుసును.

మరో సంగతి -. ఏమిటంటే - జగన్నాథరాజుగారికి బాగా మెప్పు కావాలి. తన నేర్పునీ, ప్రతిభనీ నలుగురూ మెచ్చుకోవాలి! తనమాటకి ఎదురు ఉండకూడదు. అదే ఆయనకి కావలసినది! దివాంజీగారు ఇలాటి

